క్లుప్తంగా

తిరుపతిరెడ్డిని కలిసిన నాయకులు



తిరుపతిరెడ్డితో పార్టీ నాయకులు

కొడంగల్ రూరల్ : కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డిని బుధవారం ఆ పార్టీ నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొడంగల్‌లో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారని, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారని తెలిపారు.

పూడూరు తహసీల్దార్ బదిలీ

పూడూరు: పూడూరు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌తో పాటు పలువురు అధికారులు బదిలీ అయ్యారు. పూడూరు తహసీల్దార్ రమాదేవి సంగారెడ్డి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఇద్దరు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు వివేక్ , గిరిధర్‌లు హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

వికారాబాద్ ఎంపీఓగా దయానంద్



అనంతగిరి: వికారాబాద్ మండల పంచాయతీ అధికారిగా దయానంద్ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ విధులు నిర్వహించిన నాగరాజు బదిలీపై బంట్వారం మండల ఎంపీఓగా వెళ్లారు. ఆయన స్థానంలో పరిగి ఎంపీఓ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

రెండో రోజూ కొనసాగిన రిలే దీక్షలు

బషీరాబాద్: తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ప్రకటించే వరకు పోరాటం ఆగదని మల్కన్‌గిరి గ్రామస్తులు అన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమ గ్రామాన్ని జీపీగా మార్చాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండోరోజూ బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఆరు వందల జనాభా ఉన్న మల్కన్‌గిరిలో ప్రభుత్వ రేషన్‌కార్డు కూడా లేవని వాపోయారు. ఇంకా కాశీంపూర్ అనుబంధ గ్రామంగానే కొనసాగడం వల్ల నిధుల కేటాయింపుల్లో అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ చిన్న పని కావాలన్న కాశీంపూర్‌కు వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. గతంలో తమ గ్రామం కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాలు, తండాలను జీపీలుగా చేశారని, మల్కన్‌గిరిని చేస్తామని ప్రకటించి మోసం చేశారని మండిపడుతున్నారు. కార్యక్రమంలో నాయకులు బాలక్రిష్ణ, రవీందర్, శ్రీశైలం, శ్రీనివాస్, ఎల్లేశం తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సహకారం అభినందనీయం



నోట్ పుస్తకాలు అందజేస్తున్న రాహుల్

కుల్కచర్ల: నిరుపేద విద్యార్థుల ఉన్నతికి సహకరించడం అభినందనీయమని హన్మ్యానాయక్ తండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవ్లానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని హన్మ్యానాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అఖిల భారతీయ బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాహుల్‌నాయక్ నోటుపుస్తకాలు, పెన్నులు, జామెట్రి బాక్స్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రింటర్, ప్రస్తుతం నోట్ పుస్తకాలు, జామెట్రి బాక్స్‌లు అందించడంపై సంతోషకరమన్నారు. అనంతరం రాహుల్ నాయక్ మాట్లాడుతూ.. తన తండ్రి ఆశయసాధనలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులు మావంతు సహాయ సహకరాలు నిర్విరామంగా కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింలు, అంగన్‌వాడీ టీచర్ అనురాధ, నాయకులు చందర్, నర్సింగ్‌నాయక్, రవి, శంకర్ పాల్గొన్నారు.

అధికారుల బదిలీలు

యాలాల: తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్ నాయక్, ఆర్‌ఐలు క్రిష్ణయ్య, నారాయణరెడ్డిలు బదిలీ అయ్యారు. వీరిని హైదరాబాద్ జిల్లాకు బదిలీ చేసినట్లు తహసీల్దార్ మునిరొద్దీన్ తెలిపారు. వారి స్థానంలో ఇంకా ఎవరూ రాలేదన్నారు. అలాగే, మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాధిక బదిలీ అయ్యారు. పంచాయతీ కార్యదర్శులు వీరప్ప, రాజు, అనిరాజ్, దీప వేరే మండలాలకు బదిలీ అయ్యారు.

రోడ్లన్నీ బురదమయం

ప్రస్తుతం కురుస్తున్న వరుస వర్షాలకు జిల్లాలోని రోడ్లన్నీ బురదమయంగా మారాయి.. చినుకు పడితే చాలు చిత్తడిగా మారి వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బురదలో ప్రయాణం చేయాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పలు రోడ్డులు మరమ్మతులకు నోచుకోక, కొన్ని చోట్ల పనులు కొనసాగుతుండటంతో రొచ్చురొచ్చుగా తయారయ్యాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. -సాక్షి, నెట్‌వర్క్



లక్ష్మీనారాయణపూర్ సమీపంలో బురదయమంగా మారిన దారి



యాలాల: కాగ్నా బ్రిడ్జిపై..



దోమ : లింగన్‌పల్లి-ఎల్లారెడ్డిపల్లి ..



రొచ్చు రొచ్చుగా తయారైన దుద్యాల్ రోడ్డు



అల్లిఖాన్‌పల్లి గ్రామంలో..

స్మితా సబర్వాల్‌పై ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న దివ్యాంగులు

తాండూరు టౌన్ : దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సభ్యులు బుధవారం పట్టణ సీఐ సంతోష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దశరథ్, జిల్లా మహిళా కన్వీనర్ సావిత్రమ్మలు మాట్లాడుతూ.. దివ్యాంగులకు సివిల్ సర్వీసెస్‌లో రిజర్వేషన్లు అవసరం లేదని స్మితాసబర్వాల్ పోస్టు చేయడం గర్హనీయమన్నారు. దివ్యాంగులు పలు రంగాల్లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్న విషయం ఆమె తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, షబ్బీర్, గణేష్, అశోక్ తదితరులు ఉన్నారు.

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసువాలి

బషీరాబాద్: ఉన్నతస్థాయి ఉద్యోగిగా ఉంటూ దివ్యాంగుల మనోభావాలు దెబ్బతీసేల మాట్లాడిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని బషీరాబాద్ మండల దివ్యాంగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం మండల అధ్యక్షుడు చెరుకు రాజు గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం బషీరాబాద్ పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దివ్యాంగుల మనోభావాలను కించపరిచే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. దివ్యాంగులు ఉన్నత చదువులు చదువుకోవాలంటే మనోస్థైర్యం కోల్పోయే విధంగా వాఖ్యానించారని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు నరేందర్‌గౌడ్, మహిళా అధ్యక్షురాలు జయమ్మ, కోఆర్డినేటర్ శివకుమార్ ఉన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త : సీఐ



మాట్లాడుతున్న రూరల్ సీఐ అశోక్

పెద్దేముల్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తాండూరు రూరల్ సీఐ అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని గోట్లపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు వికారాబాద్ జిల్లా కళాజాత బృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, డ్రగ్స్ అడిక్ట్, బాల్యవివాహాలు 100 డయిల్ చేయడం, బాల కార్మికులు, షీటీం బృందాలు, రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలతో పాటు పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఏమైన సమస్యలు ఉంటే వెంటనే పెద్దేముల్ పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పెద్దేముల్ ఎస్ఐ గిరి, కళాజాత బృందం, పోలీసులు పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డును పూర్తి చేయండి



ఆందోళన వ్యక్తం చేస్తున్న నాయకులు, నిర్వాహకులు

కుల్కచర్ల: అసంపూర్తి రోడ్డును వెంటనే పూర్తిచేయాలని పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అసంపూర్తిగా మిగిలిపోయిన సీసీరోడ్డు నిర్మాణం వద్ద మండల కేంద్రంలోని దుకాణసముదాయాల నిర్వాహకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక కిలోమీటరు రోడ్డు నిర్మాణానికి రెండు సంవత్సరాల సమయం పట్టిందా అని ప్రశ్నించారు. రోడ్డు ఒకవైపే వేయడం వల్ల దుకాణాలలోకి దుమ్ము, దూళి వెళ్లి అనారోగ్యానికి గురవుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. పనులు ప్రారంభించని పక్షంలో ఈ నెల 28న వ్యాపార సముదాయాలు, గ్రామస్తులు, వివిధ ప్రజాసంఘాలతో కలిసి ప్రజాధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో హరికృష్ణ, శ్రీనివాస్, బచ్చయ్య, విష్ణు, శ్రావణ్, రాంచంద్రయ్య, హన్మంతు, శేఖర్, క్రిష్టయ్య పాల్గొన్నారు.

ఊరూరా వనమహోత్సవం



కుల్కచర్ల: విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటుతున్న రామకృష్ణ

కుల్కచర్ల: వర్షాలు కురుస్తుండటంతో ప్రతి గ్రామంలో మొక్కలు నాటేందుకు అధికారులు సిద్ధమయ్యారు. బుధవారం బండవెల్కిచర్ల గ్రామంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినిలతో కలిసి ఎంపీడీఓ రామకృష్ణ మొక్కలు నాటారు. అలాగే, కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఇంటింటికి మూడు మొక్కలను పంపిణీ చేసి, మొక్కలు నాటాలని సూచించారు. చౌడాపూర్‌లో కార్యదర్శి రాజిరెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో కలిసి మొక్కలు నాటాలన్నారు. ప్రజలు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి బాలవరలక్ష్మి తదితరులు ఉన్నారు.

3200 మొక్కలు నాటాలి: పీఓ నర్సిములు

పెద్దేముల్: వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ఉపాధిహామీ ప్రోగ్రాం అధికారి నర్సింలు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో వన మహోత్సవం కార్యక్రమం కింద సుమారు లక్ష 50వేల మొక్కలు నాటాల్సి ఉందన్నారు. ప్రతి గ్రామంలో 3200 మొక్కలు నాటేలా ప్రభుత్వం టార్గెట్ ఇచ్చిందని గుర్తు చేశారు. నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి మొక్కల పంపిణీతో పాటు పాఠశాల ఆవరణలో, క్రిమిటోరియం స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఈసీ వెంకటేశం, టెక్నికల్ అసిస్టెంట్లు, ప్రవీణ్, విజయ్‌కుమార్, శ్రావన్, అంజితప్ప, మల్లేశం, సిద్ధుతో పాటు వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు



ధారూరు: రైతులకు అవగాహన కల్పిస్తున్న సంజూరాథోడ్


తాండూరు రూరల్: పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి రజిత అన్నారు. బుధవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతుబీమా దరఖాస్తులను ఆమె స్వీకరించారు. అనంతరం రజిత మాట్లాడుతూ.. జూన్ 28 వ తేదీలోపు కొత్తగా వచ్చిన పట్టా పాసుపుస్తకం పొందిన రైతులు మాత్రమే రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆగస్టు 5 చివరి తేదీ అని చెప్పారు.

రైతుబీమాపై అవగాహన

ధారూరు: కొత్తగా పాసుపుస్తకాలు వచ్చి, ఇంతవరకు బీమా చేసుకోని రైతులు వెంటనే చేయించుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి సంజూరాథోడ్ తెలిపారు. మండల పరిధిలోని రాంపూర్‌తండాలో బుధవారం రైతుబీమాపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏమైన తప్పులు ఉంటే ప్రస్తుతం సరిచేసుకోవడానికి వీలుందన్నారు. అలాగే ఆధార్‌కార్డు కార్డులో మార్పులు, నామిని మృతి చెందిన కొత్త నామిని పేరు నమోదు సరిచేసుకోవాలని సూచించారు. నామిని మైనర్ అయితే అప్పాయింట్ మేజర్ అని రాయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాన్ని ఏఈఓలకు అందజేసి వారి ముందు సంతకం పెట్టాల్సి ఉంటుందని చెప్పారు.

అన్ని వార్డుల్లో మురుగు కాల్వలు నిర్మిస్తాం

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్



మురుగు కాల్వ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

తాండూరు: మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో మురుగు కాలువలను నిర్మించి పారిశుద్ధ్య వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తామని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు రహమత్‌నగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 లక్షలతో మురుగు కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.9 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు టెండర్‌లు వేయడం జరిగిందన్నారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసేలా స్థానిక వార్డు కౌన్సిలర్లు కృషి చేయాలన్నారు.

రైతుముంగిట శాస్త్ర పరిజ్ఞానం

- రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్
- ప్రతి మంగళవారం రైతునేస్తం కార్యక్రమం
- నేరుగా శాస్త్రవేత్తలతో ముఖాముఖి



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సలహాలు వింటున్న రైతులు

దౌల్తాబాద్: రైతుల ముంగిటికి శాస్త్ర పరిజ్ఞానాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చింది. వ్యవసాయ రంగంలో ఆధునిక, శాస్త్ర పరిజ్ఞానం అందించేందుకు ప్రతి మండలంలోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసింది. ఇంటర్నెట్ సౌకర్యం, వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు బిగించారు. సాగులో వస్తున్న మెలకువలు, నూతన సాంకేతిక పద్ధతులు పంటలకు వచ్చే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు రైతులకు అందించేందుకు ప్రభుత్వం ప్రతి మంగళవారం రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని ఈనెల 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ క్రమంలో లక్ష రుణమాఫీ కార్యక్రమాన్ని రైతువేదికల ద్వారా రైతులు వీక్షించారు. ప్రతి 5వేల ఎకరాలకు క్లస్టర్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం క్లస్టర్‌ల్లో సమావేశాలు నిర్వహించి సాగు పద్ధతులపై సలహాలు, సూచనలిచ్చేందుకు రైతువేదికలను నిర్మించింది. వీటిని మరింత ఆధునీకరించి వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కీలకం కానున్న రైతువేదికలు

వ్యవసాయ రంగంలో ఆధునిక పనిముట్లు యాంత్రిక వినియోగం, చీడపీడల నివారణ, నూతన వంగడాలు వాటి ప్రాముఖ్యత, దిగుబడి, రైతుల విజయగాథలు వంటి అంశాలను రైతునేస్తం ద్వారా శాస్త్రవేత్తలు సాగులో అనుభవమున్న రైతులకు వివరిస్తారు. రైతులు నేరుగా శాస్త్రవేత్తలతో మాట్లాడి వారి సందేహాలు నివృత్తి చేసుకునే అవకాశం రైతునేస్తం ద్వారా కలిగింది. ప్రతి మంగళవారం ఉ.10 గంటలకు జరిగే కార్యక్రమంలో ఏఏ అంశాలు చర్చకు వస్తాయో ముందు రోజు విడుదల చేస్తారు. ఈ సమాచారాన్ని వ్యవసాయ అధికారులకు, రైతులకు చేరవేస్తారు. రాబోయే రోజుల్లో వ్యవసాయ సంబంధ సలహాలు, సూచనలు ప్రభుత్వం అమలు చేసే పథకాలపై రైతులు ప్రజల నుంచి అవసరమైన అభిప్రాయాల సేకరణకు రైతువేదికలు కీలకం కానున్నాయి.

రుణమాఫీ కోసం రైతువేదికలకు పరుగులు



వివరాలను ఆన్‌లైన్‌లో చెక్ చేస్తున్న ఏఈఓ

ధారూరు: రూ. లక్ష రుణమాఫీ రైతులందరికీ రాకపోవడంతో ఎందుకు రాలేదనే ఆందోళనతో బుధవారం ఆధార్‌కార్డు, పట్టాదారుపాసుపుస్తకాలతో రైతులు రైతువేదికలకు పరుగు తీశారు. ఆన్‌లైన్‌లో పరిశీలించిన ఏఈఓలు రాకపోవడానికి కారణాలను వెల్లడిస్తూ రైతులకు నచ్చజెప్పి పంపించడం కనిపించింది. మండలంలోని రైతులు వివిధ బ్యాంకుల్లో రూ. లక్ష వరకు రుణాలు తీసుకున్న వారు 2,766 మంది ఉన్నారని ఏఓ రూన్సీలక్ష్మి తెలిపారు. అందులో సంగం మందికి కూడా మాఫీ కాలేదని రైతులు వాపోయారు. ధారూరు పీఏసీఎస్‌లో రూ. లక్ష రుణమాఫీ రావాల్సిన రైతులు 1,524 మంది ఉండగా, 685 మందికే రుణమాఫీ వచ్చిందని ఓ రైతు పేర్కొనగా, హరిదాస్‌పల్లి పీఏసీఎస్‌లో 351 మంది రైతులుండగా 144 మందికి రుణమాఫీ వర్తించిందన్నారు. రెండో విడతలో మిగిలిన వారందరికీ రావచ్చని ఏఈఓలు రైతులకు చెప్పి పంపించారు.

హైస్కూల్ పనివేళల్లో మార్పు

దౌల్తాబాద్: ఉన్నత పాఠశాలల పని వేళలు మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత పనివేళలను మారుస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 22 నుంచి జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో ఉ. 9గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పనిచేయనున్నాయి.

గతంలో ఇలా...

గతంలో ప్రాథమిక పాఠశాలలు ఉ.9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు, ఉన్నత పాఠశాలలు ఉ. 9.30 నుంచి సా. 4.45గంటల వరకు పని చేశాయి. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల సమయంలో తేడా ఉండడంతో పని వేళల్లో మార్పు చేయాలని పలువురు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నత పాఠశాలలు ఉ. 9గంటల నుంచి సా. 4.15 గంటల వరకు కొనసాగుతాయని ఆదేశాలు జారీ చేశారు.

చిరస్థాయిగా ఉపాధ్యాయుల సేవలు

మండల విద్యాధికారి హరిశ్చందర్



పరిగి: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ

పరిగి: పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతికి కృషి చేసిన ఉపాధ్యాయుల సేవలు విద్యార్థులు, గ్రామస్తుల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. మండల పరిధిలోని చిట్యాల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం సన్మానించి వీడ్కోలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిని దృష్టిలో ఉంచుకుని బోధనాలు చేయాలని సూచించారు. మంచిగా విధులు నిర్వహిస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉస్మాన్ అలీ, ఎస్ఎంసీ చైర్మన్ జంగాకృష్ణ, ప్రవీణ్, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయవృత్తి పవిత్రమైంది..

తాండూరు రూరల్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని గౌతపూర్ మాజీ సర్పంచ్ రాజప్ప, మాజీ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డిలు అన్నారు. బుధవారం మండలంలోని గౌతపూర్ ప్రాథమిక పాఠశాల్లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులతో పాటు నూతనంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని అన్నారు. 14 సంవత్సరాలు గౌతపూర్ పాఠశాల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయురాలు కవితను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లిలావతి, ఉపాధ్యాయులు ఉమాదేవి, మాధురి ,సుశీల,బోయిని రాజు, రమేష్‌లు ఉన్నారు.

బదిలీలు సహజం

పెద్దేముల్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజమని తట్టెపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోజప్ప అన్నారు. బుధవారం మండలంలోని తట్టెపల్లి ఉన్నత పాఠశాలల్లో బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం మురళీమోహన్, ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, సతీష్, ప్రదీప్, ఆనంతం, ప్రకాష్, గోపాల్‌లకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువతో సన్మానించారు. నవ సమాజ నిర్మాణం ఉపాధ్యాయుల బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కవిత, వెంకటేష్, విజయకుమార్, ప్రభాకర్‌రావు, భీమయ్య, సుజాత, జగదాంబ, మంజుల, ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కట్టమైసమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు, చిన్నారులు



దోమ : పోచమ్మ తల్లికి బోనాలను సమర్పిస్తున్న భక్తులు

తాండూరుటౌన్ : పట్టణంలోని వీరశివాజి నగర్‌కాలనీలో వెలిసిన రాయికుంట కట్టమైసమ్మ బోనాల జాతర బుధవారం ఘనంగా జరిగింది. పట్టణ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీపానర్సింలు అమ్మవారికి ప్రత్యేక బోనాన్ని సమర్పించారు. డప్పువాయిద్యాల నడుమ మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

పోచమ్మ బోనాలు

దోమ : మండల పరిధిలోని మోత్కూర్, పాలేపల్లి గ్రామాల్లో గ్రామ దేవత పోచమ్మకు బోనాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం గ్రామాల్లోని మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి బయలుదేరి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింత మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపును ప్రజలు వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులంతా పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిపించి, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో కేఎస్ఆర్ ట్రస్ట్ వస్థాపకురాలు రాజేశ్వరమ్మ, చెర్మన్ శరత్‌కుమార్ కుటుంబ సభ్యులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.